క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష సహాయం



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ సమీపంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక వ్యాపారి కడగల సూరి రూ.1,00,116 ఆర్థిక సహాయం చేశారు. నగదును శ్రీ ధర్మశాస్త్రా చారిటబుల్ ట్రస్టు, ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దానరి రవి, అప్పికొండ ఆదిబాబుకు బుధవారం అందజేశారు.

మునగ మొక్కల పంపిణీ



మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అరుణ

జామి: వెలుగు ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచిన మునగ మొక్కలను డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎంపీపీ నల్బురపు అరుణ, వైస్ ఎంపీపీ ఎన్నింటి విజయలక్ష్మి మంగళ వారం పంపిణీ చేశారు. ఒక్కొక్క మొక్కను రాయితీపై రూ.2 చొప్పున అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నతీష్, వెలుగు ఏపీఎం మధుమహేష్, ఉపాధి హామీ పథకం ఏపీఓలు శేఖర్, కిరణ్మయి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

బొండపల్లి: మండలకేంద్రం బొండపల్లిలో బుధవారం జూదమాడుతుండగా పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామానికి సమీపంలో జూదమాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,810 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.


పార్టీ బలోపేతానికే గృహసారథులు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ

బొండపల్లి: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకే ప్రతీ 50 కుటుంబాలకు ఇద్దరు చొప్పున గృహ సారథులను నియమిస్తున్న ట్లు ఆపార్టీ నాయకులు, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ అన్నారు. గొట్లాం గ్రామంలో గృహసారథులు ఎంపికకు సంబంధించి వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, గ్రామ సర్పంచ్ మండా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి కూడారై సేవ



గోదాదేవి అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

జామి: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్నంరాజుపేట వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం కూడారై సేవ నిర్వహించారు. అనంతరం అర్చకులు ఫణిహారం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారిని పెళ్లి కుమార్తెగా చేసి, ముత్త యిదువులు పసుపు దంచారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంత రం గోదాదేవి అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

గంట్యాడ: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని సీఆర్పీ ఎర్నిబాబు అన్నారు. మండలంలోని కొర్లాం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులను ఇష్టానుసారం వినియోగించడం వల్ల భూమి తన సహజ సిద్ధమైన సారాన్ని కోల్పోతుందని, పంటలకు మేలు చేసే మిత్రపురుగులు, కీటకాలు చనిపోతాయని అన్నారు. సేంద్రియ ఎరువులు, కషాయాలతో పంటలను సాగు చేసుకుంటే పెట్టుబడి తగ్గడంతో పాటు ఈ విధానంలో సాగుచేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే చాలా వరకు రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అండగా ప్రభుత్వం

- ఉపకరణాల పంపిణీలో ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు



చీపురుపల్లి: ఉపకరణాలు అందజేస్తున్న జెడ్పీటీసీ శిరీష, తదితరులు



శృంగవరపుకోట: ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: ప్రత్యేక అవసరాల పిల్లల(దివ్యాంగులు)కు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరి అవసరాలు గుర్తించి, వారి కోసం పని చేసే వ్యక్తి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక చింతబడి ప్రాంగణంలోని భవిత కేంద్రంలో ఎంఈఓ సీహెచ్. సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి ఎమ్మెల్యే బుధవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్.కోట మండలంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు రూ.2,74,000 విలువైన ఉపకరణాలు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఉపకరణాలు అందించేందుకు శిబిరాలు నిర్వ హించి 21 రకాల అంగవైకల్యాలను గుర్తించి వారికి పరికరాల తో పాటు అలవెన్సులు, బస్సు పాస్‌లు, ఇతర పథకాలు అందజేస్తు న్నామని చెప్పారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ దివ్యాం గులకు పెన్షన్లు, పరికరాలు, మధ్యాహ్న భోజనం, ఫిజియోథెరపీ సేవలు ఇలా అన్ని అవసరాల ను సీఎం జగన్ తీరుస్తున్నారని అన్నారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఏమైనా అవసరా ఉంటే తగిన సహాయం అందిస్తామన్నారు. సమగ్రశిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.29 లక్షల విలువ చేసే ఉపకరణాలు పంపిణీ చేశా మని, వీరికి అయిదు రకాల అలవెన్సులు ఇస్తున్నామన్నారు. భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీ, ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయుల ద్వారా ఆటపాటలతో కూడి విద్య అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు బి.లీలాకృష్ణ, జి.సత్యనారాయణ, ఐఈడీఎస్ఎస్ టీచర్ ఆర్.శ్రీనివాసరావు, ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల సేవలను వినియోగించుకోవాలి

చీపురుపల్లి: ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలను సద్వినియోగించుకోవాలని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష సూచించారు. పట్టణంలోని పోలీస్‌లైన్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 12 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు వినికిడి యంత్రాలు, సీపీ కుర్చీలు, వీల్ చైర్స్, రోలేటర్లు, ట్రై సైకిళ్లు తదితర 13 రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల్లో ఆత్మనూన్యతా భావం లేకుండా వారు కూడా సాధారణ పిల్లలతో సమానంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వారికి అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల్లో వైకల్యాన్ని తగ్గించేందుకు భవిత కేంద్రాల్లో ఫిజియో, స్పీచ్ థెరపీ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు రోజూ భవిత కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల, ఎంఈఓ ఎస్.భాను ప్రకాష్, ఐఈఆర్పీలు సత్యనారాయణ, త్రినాథ్ పాఠశాల హెచ్‌ఎం ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గర్భిణి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న స్త్రీ, శిశుసంక్షేమ సాధికారిత అధికారి శాంతకుమారి

గంట్యాడ: విధుల్లో నిర్లక్ష్యం వహించే అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శాంతకుమారి అన్నారు. మండలంలోని కొర్లాం, తామరపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఆమె తనిఖీ లు చేశారు. ముందుగా బొర్సపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలు హాజరు, రికార్డులు పరిశీలించారు. ప్రీస్కూల్ నిర్వహిస్తున్నారా లేదా అని అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ఓ గర్భిణి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్యంపై, అంగన్‌వాడీ కార్యకర్తలు గృహ సందర్శన చేస్తున్నారా, ఆరోగ్య నియమాలు గురించి చెబుతున్నారా లేదా అని ఆరా తీశారు. సకాలంలో వైద్య తనిఖీలు చేయించుకోవాలని గర్భిణికి సూచించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని చెప్పారు. కొండతామరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు.

ముగిసిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు

- విజేత జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి



విజేత గులివిందాడ జట్టుకు ట్రోఫీ, చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,తదితరులు

కొత్తవలస: శారద మెటల్స్ అండ్ ఎల్లోయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. 34 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో గులివిందాడ, తుమ్మికాపల్లి జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగగా గులివిందాడ జట్టు విజేతగా నిలిచింది. మూడోస్థానంలో అర్థన్నపాలెం, నాలుగో స్థానంలో గొల్లలపాలెం జట్లు నిలిచాయి. బహుమతి ప్రదానానికి అతిథిగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు.శారద కర్మాగారం ఎండీ నీరజ్‌శారదతో కలిసి విజేత గులివిందాడ జట్టుకు రూ.లక్ష, రన్నర్‌గా నిలిచిన తుమ్మికాపల్లి జట్టుకు రూ.50 వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లుకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ జట్టుకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా పోటీలతో యువతలో స్నేహభావం పెరుగుతుందని అన్నారు. శారద కర్మాగారం ఎండీ నీరజ్‌శారద మాట్లాడుతూ కొత్తవలస మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గొరపల్లి శివ, పీఏ ఎస్.బాలసూర్యారావు, కర్మాగార ప్రతినిధులు సన్యాసిరావు, జి.శంకరరావు, కోచ్‌లు ఎం.శంకర్, రామస్వామినాయుడు, కృష్ణంరాజు, జాతీయ స్థాయి కోచ్ గవర సూరిబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పౌరోహిత్యాన్ని వృత్తిగా గుర్తించండి



మండల అర్చక సంఘ కన్వీనర్లను అభినందిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య పెద్దలు

శృంగవరపుకోట: పౌరోహిత్యాన్ని ప్రభుత్వం వృత్తిగా గుర్తించి, సామాజిక భద్రత, భరోసా కల్పించాలని బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మండల అర్చక, పురోహిత సంఘ సమావేశం సంఘ గౌరవ అధ్యక్షుడు వి.భాస్కరశర్మ నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అర్చక సంఘ కన్వీనర్లుగా విన్నకోట సూర్యనారాయణమూర్తి, రెడ్డి అయ్యప్పశర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అరవెల్లి శ్రీనివాసశర్మ, కార్యదర్శి వి.ప్రసన్నకుమార్, ఉపా ధ్యక్షులు బి.సుందరశర్మ, చింతా సూర్యప్రకాశ్, ఎ.సూర్యనారాయణమూర్తి, సలహాదారు నిష్టల ధర్మారావు, అధికార ప్రతినిధి పి.రామ్మూర్తిశర్మ, ఎస్.కోట మండల బ్రాహ్మణ సంక్షేమ సం ఘం అధ్యక్షుడు గార్లపాటి సత్యసాయి మాట్లాడుతూ బ్రాహ్మణులకు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విద్య ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, బ్రాహ్మణ సమాజం ఆర్థిక, సామాజిక తోడ్పాటుకు ప్రభుత్వం ఊతమివ్వాలని కోరారు.

రూ.18 లక్షలతో ఇంటింట కుళాయిలు



ఇంటింట కుళాయిలకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామంలో ఇంటింట కుళాయిల ఏర్పాటుకు సర్పంచ్ వడ్లమాని శర్మ ఆధ్వర్యంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.18 లక్షలతో ఇంటింట కుళాయి లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కృషితో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింట కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైస్ ఎంపీపీలు అడపా ఈశ్వరరావు, దాయిరి ముత్యాలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, జిల్లా పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ




క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తవుడు, తదితరులు

గజపతినగరం: ఏపీ కార్పెంటర్స్, వడ్రంగి అసోసియేషన్ క్యాలెండర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ కార్పెంటర్స్, వడ్రంగి అసోసియేషన్ కార్యదర్శి అండ్లూరి గణేష్, గజపతినగరం మండల అధ్యక్షుడు కొమ్మోజి అప్పలాచారి, కోశాధికారి సింహాద్రి సన్యాసిరావు, సభ్యులు కడియాల కృష్ణ,వేమలి సన్యాసిరావు, పి.రాములు పాల్గొన్నారు.

చిగుర్లు తుంచి నాటుకోవాలి

గుర్ల: నాట్లు వేసే ముందు వరి నారు చిగుర్లు తుంచాలని, ఈ విధంగా చేయడం వల్ల చాలా వరకు తెగుళ్లను నియంత్రించవచ్చని ఏఓ ఎ.తిరుపతి రావు అన్నారు. మండలంలోని సాలిపిసోమరాజుపేటలో రబీ వరినాట్లపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. నాట్లు వరుస క్రమంలో వేయడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగులుతుందని, తెగుళ్ల కూడా వ్యాప్తి చెందవని చెప్పారు. రైతులు తప్పకుండా ఈ-క్రాప్‌లో పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

సచివాలయంలో తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, ఉద్యోగుల హాజరు పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు మంజూరు చేయాలని, ప్రజలు అందించే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని సూచించారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన

బొండపల్లి: మండలంలోని అయ్యన్న అగ్రహారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంపీడీఓ ఏ.వేదవతి బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు అందించాలని పథకం నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీఓ వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి కృషి

చీపురుపల్లి: డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి గ్రామైక్య సంఘం కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని సెర్ప్ అధికారులు ఆన్‌లైన్ ద్వా రా అవగాహన కల్పించారు. మండలంలోని 35 గ్రామైక్య సంఘాల కార్యవర్గ సభ్యులకు రెండు రోజుల పాటు జూమ్ ద్వారా నిర్వహించనున్న శిక్షణ స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. సంఘాల పనితీరు, రికార్డుల నిర్వహణ, బ్యాంకు లింకేజ్ రుణాలను సద్వినియోగం చేసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో జీవనోపాధులను ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏపీ జి.సీతారామయ్య, డీపీఎం రవి, ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి

గజపతినగరం: తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే చిరుధాన్యాల పంటలను సాగుచేసేలా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథ స్వామి వీఏఏలకు సూచించారు. గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధి వీఏఏలతో స్థానిక వ్యవసాయ శాఖ మార్కెట్ కార్యాలయంలో వీఏఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి తీర్మానించిందని అన్నారు. చిరుధాన్యాల సాగుతో పాటు వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించిన పంటల సాగు వివరాలను ఫిబ్రవరి 15వ తేదీలోగా పూర్తి చేయాలని, అలాగే పీఎం కిసాన్ పథకానికి అర్హత ఉన్న రైతుల ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఏడీఏ ప్రకాష్, గజపతినగరం ఏడీఏ కె.మహారాజన్, ఏఓ ధనలక్ష్మి, టెక్నికల్ ఏఓ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు భోగీ మంటలు వెలిగించగా..విద్యార్థులు మంటల చుట్టూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయినిలు భోగీ పళ్లు పోశారు. విద్యార్థినులు రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. చిన్నారులు హరిదాసుల వేషధారణలతో అలరించారు. సంక్రాంతి పండగ ప్రాశస్త్యం గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

– కొత్తవలస/ లక్కవరపుకోట/చీపురుపల్లిరూరల్/ బొండపల్లి/ వేపాడ/ కొత్తవలస రూరల్



వేపాడ: వేపాడలోని గురుకుల బాలికల పాఠశాలలో భోగీ మంట చుట్టూ ఉపాధ్యాయినులు, విద్యార్థినుల నృత్యాలు



వేపాడ: విక్టరీ హైస్కూల్‌లో వేసిన భోగీ మంట



చీపురుపల్లిరూరల్: గరివిడి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో భోగీ మంట వేస్తున్నఅధ్యాపకులు, విద్యార్థులు



కొత్తవలస రూరల్: దేవాడ అమరావతి పాఠశాలలో సంప్రదాయ వేషధారణలో చిన్నారులు



లక్కవరపుకోట: హరిదాసు వేషధారణలో దాసుళ్లపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



కొత్తవలస: గాయిత్రీ విద్యామందిర్ పాఠశాలలో చిన్నారులకు భోగీ పళ్లు పోస్తున్న ఉపాధ్యాయినులు



చీపురుపల్లిరూరల్: గరివిడి మండలం బొండపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినులు వేసిన ముగ్గులు



వేపాడ: చామలాపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థినుల కోలాటం



బొండపల్లి: గాయిత్రీ టెక్నో స్కూల్‌లో భోగీ సందడి...

శాశ్వత భూహక్కు కల్పించేందుకే రీసర్వే



రీసర్వే వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

శృంగవరపుకోట: దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు శాశ్వత భూహక్కులు కల్పించేందుకే ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహ క్కు, భూరక్ష పథకంలో భాగంగా సమగ్ర రీసర్వే చేయిస్తోందని విజయనగరం ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ అన్నారు. మండలంలో భూరీసర్వేపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. మండలంలో ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఎల్పీఎంల కేటాయింపు, ఖాతాలు ఇవ్వడం, డీఎల్ఆర్ సిద్ధం చేయడంలో వీఆర్వోలకు సూచనలు చేశారు. పక్కాగా సర్వే చేయాలని అన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించకుండా మొక్కుబడి వివరాలతో ఎంట్రీలు చేస్తే కొత్త చిక్కులు వస్తాయని, అందుకు క్షేత్రస్థాయి నుంచి మండలస్థాయి వరకు అధికారులు అంతా జవాబుదారీ అవుతారని చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎం.హరి తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి మండలస్థాయి వాలీబాల్ పోటీలు

కొత్తవలస: ఫర్ ది పీపుల్ ట్రస్టు, వసంత్ విహార్ సంయుక్తంగా ఈనెల 13వ తేదీ నుంచి మండల కేంద్రం సమీపంలోని వసంత్ విహార వద్ద మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లుకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశ రుసుంగా రూ.300 చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 95736 21009, 99664 42135 నంబర్లను సంప్రదించాలని సూచించారు.